www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 140 | శనివారం | 05 - 04 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## కైసర్ నగర్లో ప్రజా పాలనలో
### ఆగని కబ్జాల పరం పర



3

## బంగ్లాదేశ్ నేత యూనుస్‌తో ప్రధాని మోదీ భేటీ



తొలిఅడుగు, బ్యాంగ్‌కాక్: థాయిల్యాండ్‌లోని బ్యాంగ్‌కాక్‌లో జరుగుతున్న బిమ్స్‌టెక్ శిఖరాగ్ర సమావేశాల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. అక్కడ ఇవాళ ఆయన బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ మొహమ్మద్ యూనుస్‌ను కలిశారు. ఆ ఇద్దరూ

2

# ఉపాధి పెరుగుతుంది


- హైదరాబాద్‌ను విస్తరిస్తే మరిన్ని పెట్టుబడులు వస్తాయి
- ఈ ప్రభుత్వం ఏడాది వ్యవధిలోనే 53 వేల మందికి నియామకపత్రాలు ఇచ్చిందని వెల్లడి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



తొలిఅడుగు, హైదరాబాద్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత పోరాటం చేసిందని, వారి ఆశలను నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 53 వేల మందికి ఉద్యోగ నియామకపత్రాలు ఇచ్చిందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలోని 112 మంది భూ నిర్వాసితులకు ప్రభుత్వం టీఎస్ జెన్‌కోలో

2

## కంచ గచ్చిబౌలి ప్రాంతంలో ఆంక్షలు



తొలిఅడుగు, హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి ప్రాంతంలో సైబరాబాద్ పోలీసులు ఆంక్షలు విధించారు. 400 ఎకరాల విస్తీర్ణంపై సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో కేసుల పెండింగ్ దృష్ట్యా ఇతరుల సంచారంపై ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. ప్రశాంతతకు భంగం కలిగేలా ఎవరూ తిరగవద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. విధుల్లో ఉన్న అధికారులను

2

## బావిలో విషవాయువు పీల్చి ఎనిమిది మంది మృతి



తొలిఅడుగు, మధ్యప్రదేశ్ : రాష్ట్రంలో విషాదం చోటు చేసుకుంది. బావి లో విషవాయువు పీల్చి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఖాండ్వా జిల్లాలో గురువారం ఈ ఘటన చోటు

2

# విద్యార్థులకు భవిష్యత్తు కల్పించాలి

- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను బోధించాలి - వీసీలతో భేటీ, విద్యా కమిషన్ సమీక్షలో సీఎం



తొలిఅడుగు, హైదరాబాద్ : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలన్నీ విద్యార్థులు కేంద్రంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. యూనివర్సిటీల్లో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కోర్సులు ఉండాలని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్లతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి, ఆర్థిక స్థోమత లేని కుటుంబాల నుంచే విద్యార్థులు వస్తున్నారని, వారికి సరైన భవిష్యత్తు కల్పించేలా బోధన ఉండాలని అన్నారు. ఆర్థిక స్థోమత ఉన్న కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకొని ప్రైవేట్ యూనివర్సిటీల వైపు వెళ్తున్నారని తెలిపారు. వారితో ఎదురయ్యే పోటీని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఎదుర్కోవాలంటే డిమాండ్ ఉన్న కోర్సులనే బోధించాలని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పలు యూనివర్సిటీల్లో పెద్దగా ప్రాధాన్యం లేని కోర్సులను బోధిస్తున్నారని, వాటిని రద్దు చేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. ఆయా కోర్సులకు చెందిన ప్రొఫెసర్లకు అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలు అప్పగించాలన్నారు.

2

### భద్రాచలం సీతారాముల
## కల్యాణోత్సవానికి సీఎం

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కల్యాణం ప్రారంభమవుతుండగా... ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్‌రెడ్డి స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. కాగా, భద్రాద్రి రాముడికి ముఖ్యమంత్రి అధికారికంగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఒకే ఒక్క సారి జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకే ఒక్కసారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. నిరుడు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ... పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ముఖ్యమంత్రి సహా ఇతర ప్రజాప్రతినిధులెవరూ పాల్గొనలేదు. దశాబ్దం తర్వాత సీతారాముల కల్యాణోత్సవానికి సీఎం రేవంత్ అధికారికంగా హాజరవుతున్నారు.

## పది లక్షలు చెల్లించకపోవడంతో చికిత్స నిరాకరణ.. గర్భిణీ మృతి



తొలిఅడుగు, ముంబై: చికిత్సకు ముందే పది లక్షలు చెల్లించాలని ప్రైవేట్ హాస్పిటల్ సిబ్బంది డిమాండ్ చేశారు. ఆ డబ్బు చెల్లించకపోవడంతో చికిత్స అందించేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యం విషమించడంతో గర్భిణీ మరణించింది. మహారాష్ట్రలోని పూణేలో ఈ సంఘటన జరిగింది. బీజేపీ ఎమ్మెల్సీ అమిత్ గోరే?కు ప్రైవేట్ సెక్రటరీగా పనిచేస్తున్న సుశాంత్ భార్య

2

## వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ ఎంపీ పిటిషన్




తొలిఅడుగు న్యూఢిల్లీ: పార్లమెంటు ఉభయసభల్లో ఆమోదించిన వక్ఫ్ (సవరణ) బిల్లు-2024 ను కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్ సుప్రీంకోర్టు లో సవాలు చేశారు. ముస్లింల పట్ల వివక్షాపూరితమైన బిల్లుగా దీనిని పేర్కొంటూ ఆయన శుక్రవారంనాడు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. లోక్‌సభలో బుధవారంనాడు బిల్లుపై చర్చ అనంతరం ఓటింగ్ నిర్వహించగా, బిల్లుకు అనుకూలంగా

2

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ములుగు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన



తొలిఅడుగు, ములుగు : రాష్ట్రంలో గురువారం కురిసిన అకాల వర్షానికి పలు జిల్లాల్లో వందల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో కోతకు వచ్చిన సుమారు 400 ఎకరాల వరి పంట నేలవాలింది. వడగండ్ల ధాటికి మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో మండలంలో వరి, మిర్చి పంట దెబ్బతిన్నది. కమలాపురం వద్ద 30

2

## ఏపీలో నామినేటెడ్ పదవుల పండగ




తొలిఅడుగు, అమరావతి : ఏపీలో నామినేటెడ్ పదవుల కేటాయింపు కొనసాగుతోంది. అందులోభాగంగా 38 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల పేర్లను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఈ ఏఎంసీ ఛైర్మన్ పదవుల్లో 31 టీడీపీ, 6 జనసేన, 1 బీజేపీ నేతలకు కేటాయించిందీ ప్రభుత్వం. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీల ఛైర్మన్లను ప్రకటిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అందుకోసం కసరత్తు జరుగుతోందని పేర్కొంది. 2024 మే, జూన్ మాసాల్లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ఓటరు కూటమికి పట్టం

2

## బర్డ్ ఫ్లూపై రంగంలోకి కేంద్రం



తొలిఅడుగు డెస్క్ : తెలంగాణ, ఛత్తీసగఢ్, ఝార్కండ్ సహా దేశవ్యాప్తంగా ఆరు జోన్లలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో.. జీవభద్రత నిబంధనలను కేంద్రం కఠినతరం చేసింది. శుభ్రతను పాటించాలని, పౌల్ట్రీ ఫారాల్లోకి ఎవరు పడితే వారు ప్రవేశించకుండా చూసుకోవాలని, నెలరోజుల్లోగా

2

## బంగ్లాదేశ్ నేత యూనుస్‌తో ప్రధాని మోదీ భేటీ

మొదటిపేజీ తరువాయి

కరచాలనం చేసుకున్నారు. పలు అంశాలపై మాట్లాడారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను తొలగించిన తర్వాత .. యూనుస్‌తో మోదీ భేటీ అయ్యారు. బంగ్లాలో భారతీయ మైనార్టీలపై దాడులు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాముఖ్యత సంతరించుకున్నది. మరో వైపు ఇటీవల చైనా పర్యటనలో బంగ్లా నేత ఈశాన్య రాష్ట్రాలపై వివాదాస్పద కామెంట్ చేసిన విషయం తెలిసిందే. బిమ్స్‌టెక్ సభ్య దేశాలను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. భారత్‌లోని యూపీఐ పేమెంట్ విధానాన్ని.. సభ్య దేశాలతో పంచుకోనున్నట్లు చెప్పారు. దీని ద్వారా వాణిజ్యం, వ్యాపారం, టూరిజం మెరగవనున్నట్లు వెల్లడించారు. బిమ్స్‌టెక్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా వార్షిక వ్యాపార సదస్సులు నిర్వహించుకోవచ్చు అని చెప్పారు. స్థానిక కరెన్సీతో ట్రేడ్ చేసుకోవచ్చు అని తెలిపారు. మార్చి 28వ తేదీన భూకంపం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు చవిచూసిన మయన్మార్, థాయిలాండ్‌కు మోదీ సంతాపం తెలిపారు.

## బావిలో విషవాయువు పీల్చి ఎనిమిది మంది మృతి

మొదటిపేజీ తరువాయి

చేసుకుంది. ఛైగావ్ మఖాన్ ప్రాంతంలో గంగౌర్ పండుగ వేడుకల్లో భాగంగా విగ్రహాల నిమజ్జనం కోసం గ్రామస్థులు గురువారం బావిని సిద్ధం చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ఖాండ్వా కలెక్టర్ రిషవ్ గుప్తా తెలిపారు. బావిలో పేరుకుపోయిన బురదను తొలగించడానికి ముందుగా ఐదుగురు వ్యక్తులు బావిలోకి దిగారు. వారు అందులోని విష వాయువుల కారణంగా స్పృహ కోల్పోయి.. బురదలో మునిగిపోయారు. వారిని రక్షించేందుకు మరో ముగ్గురు బావిలోకి వెళ్లారు. కానీ విషవాయువు ప్రభావంతో వారు కూడా అందులోనే చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోయినట్లు కలెక్టర్ వివరించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా యంత్రాంగం, పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు నాలుగు గంటల పాటు శ్రమించి ఎనిమిది మృతదేహాలను ఒక్కొక్కటిగా బావి నుంచి వెలికితీశారు. మృతులు రాకేశ్ పటేల్ (23), అనిల్ పటేల్ (25), అజయ్ పటేల్ (24), శరణ్ పటేల్ (35), వసుదేవ్ పటేల్ (40), గజనన్ పటేల్ (35), అర్జున్ పటేల్ (35), మోహన్ పటేల్ (53) గా గుర్తించారు.

## పది లక్షలు చెల్లించకపోవడంతో చికిత్స నిరాకరణ.. గర్భిణీ మృతి

మొదటిపేజీ తరువాయి

తనిషా ఏడు నెలల గర్భిణి. గర్భంలో కవలున్న ఆమె సంబంధిత సమస్యలతో ఇబ్బందిపడింది. దీంతో పూణెలోని దీనానాథ్ మంగేష్కర్ హాస్పిటల్‌కు ఆమెను తరలించారు. కాగా, తనిషాకు చికిత్స అందించేందుకు పది లక్షలను హాస్పిటల్ సిబ్బంది డిమాండ్ చేశారు. ఆ డబ్బు చెల్లిస్తేనే చికిత్స ప్రారంభిస్తామని చెప్పారు. ముందుగా రూ.2.5 లక్షలు చెల్లిస్తానని ఆమె భర్త సుశాంత్ చెప్పినప్పటికీ చికిత్సకు నిరాకరించారు. ఒకేసారి పది లక్షలు చెల్లించలేక తనిషాను మరో హాస్పిటల్‌కు తరలించారు. అయితే చికిత్సలో జాప్యం వల్ల డెలివరీ కాంప్లికేషన్స్‌తో ఆమె మరణించింది. మరోవైపు భార్య తనిషా మరణానికి దీనానాథ్ మంగేష్కర్ హాస్పిటల్ నిర్లక్ష్యం కారణమని ఆమె భర్త సుశాంత్ ఆరోపించాడు. 'వారు జీవితం కంటే డబ్బుకు ప్రాధాన్యత ఇచ్చారు. సకాలంలో చేర్చుకున్నట్లయితే ఆమె బతికి ఉండేది' అని వాపోయాడు. ఆ హాస్పిటల్ నిర్లక్ష్యంపై ఆమె కుటుంబం ఫిర్యాదు చేసింది. దీంతో దర్యాప్తు కోసం మెడికల్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారి తెలిపారు. కాగా, ఎమ్మెల్సీ అమిత్ గోరే? ఈ సంఘటనపై స్పందించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతానని అన్నారు. అయితే మీడియాలో ప్రసారమవుతున్న సమాచారం అసంపూర్తిగా ఉందని, తమ ప్రతిష్టను దెబ్బతీస్తున్నదని దీనానాథ్ మంగేష్కర్ హాస్పిటల్ పీఆర్వో ఆరోపించారు. అంతర్గతంగా విచారణ జరిపి నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులకు అన్ని వివరాలు సమర్పిస్తామని పేర్కొన్నారు.

## వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ ఎంపీ పిటిషన్

మొదటిపేజీ తరువాయి






288, వ్యతిరేకంగా 232 ఓట్లు పడ్డాయి. దీంతో లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందింది. అనంతరం గురువారం అర్ధరాత్రి దాటే వరకూ బిల్లుపై చర్చ జరిపి ఓటింగ్ నిర్వహించారు. రాజ్యసభలోనూ బిల్లు గట్టెక్కింది. బిల్లుకు మద్దతుగా 128 మంది, వ్యతిరేకంగా 1232 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయాల్సి ఉంది. కాగా, వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింల ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందని జావెద్ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని పలు నిబంధనలను బిల్లు ఉల్లంఘించిందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టిక్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 25 (స్వేచ్ఛగా తమ మతాన్ని అనుసరించడం), ఆర్టికల్ 26 (మత సంబంధమైన వ్యవహారాల నిర్వహణా స్వేచ్ఛ), ఆర్టికల్ 29 (మైనారిటీ హక్కులు), ఆర్టికల్ 300ఎ (ఆస్తిహక్కు)లను ఉల్లంఘించేలా బిల్లు ఉందని తెలిపారు. లోక్‌సభలో కాంగ్రెస్ విప్‌గా పనిచేసిన జావెద్, వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీలో సభ్యుడిగా కూడా ఉన్నారు.

# ఉపాధి పెరుగుతుంది

మొదటిపేజీ తరువాయి



ఉద్యోగాలను కల్పించింది. వాటికి సంబంధించిన నియామక పత్రాలను మాదాపూర్‌లోని సైబర్ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో అభ్యర్థులకు భట్టి విక్రమార్క అందజేశారు. భూమి కోల్పోయిన వారికి ఉద్యోగం : నల్గొండ జిల్లాలోని దామచర్ల మండలం వీర్లపాలెంకు చెందిన 112 మందికి జూనియర్ అసిస్టెంట్లు, ప్లాంట్ అటెండర్లు, ఆఫీస్ సబార్డినేట్లుగా ఉద్యోగాలను కల్పించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలిస్తామని గత ప్రభుత్వంలోని నేతలు చెప్పారని, భూ నిర్వాసితులు వృద్ధులైపోయారు కానీ, ఉద్యోగాలివ్వలేదని వ్యాఖ్యానించారు. ఇప్పుడు అలా జరగకుండా భూమి కోల్పోయిన వారికి వెంటనే ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తున్నామన్నారు.

"ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత పోరాటం చేసింది. తెలంగాణ వచ్చి పదేళ్లు గడిచిన యువత ఆశలు నెరవేరలేదు. ఈ ప్రభుత్వం ఏడాది వ్యవధిలోనే 53 వేల మందికి నియామకపత్రాలు ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేనివారికి ఉపాధి కల్పించే కార్యక్రమం చేపట్టాం. రాజీవ్ యువవికాసం ద్వారా యువతకు ఉపాధి కల్పించనున్నాం. రాజీవ్ యువవికాసం పథకానికి రూ.9వేల కోట్లు కేటాయించాం. ప్రైవేటు రంగంలోనూ యువతకు ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేని వారికి ఉపాధి కల్పించే కార్యక్రమం చేపట్టామని, రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు ఉపాధి కల్పించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ పథకానికి రూ.9 వేల కోట్లు కేటాయించామన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేలా ఒప్పందాలు చేసుకున్నామని, రాజీవ్‌గాంధీ సూచన మేరకు హైటెక్ సిటీకి నేదురమల్లి జనార్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని తెలిపారు. రాజీవ్ గాంధీ కృషితో నేడు ఐటీ రంగం ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోందని, ఫ్యూచర్ సిటీలో మరిన్ని కంపెనీలు ఏర్పాటయ్యేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌ను విస్తరిస్తే మరిన్ని పెట్టుబడులు రావడంతో పాటు ఉపాధి కూడా పెరుగుతుందని తెలిపారు.

# కంచ గచ్చిబౌలి ప్రాంతంలో ఆంక్షలు

మొదటిపేజీ తరువాయి

అడ్డుకుంటే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. దురుద్దేశంతో వచ్చే వ్యక్తుల ప్రవేశం పైనా కంచ గచ్చిబౌలి భూముల్లో నిషేధ విధిస్తున్నట్లు వెల్లడించారు. ఆంక్షలను అందరూ విధిగా పాటించాలని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. కోర్టుల తీర్పు వచ్చేంతవరకూ ఈ ఆంక్షలు ఉండే అవకాశం ఉంది.

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చెట్ల తొలగింపు పనులతో పాటు అక్కడి భూమిలో చెట్ల సంరక్షణ మినహా అన్నిరకాల కార్యకలాపాలను తక్షణం నిలిపేయాలని అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఆదేశించింది. కేవలం మూడు రోజుల్లోనే 100 ఎకరాల్లో చెట్లను కొట్టేయడంపై తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసింది. చెట్ల నరికివేతకు అనుమతులు, పర్యావరణ మదింపు పత్రాలు ఉన్నాయా? అంటూ నిలదీసింది. కంచ గచ్చిబౌలిలో 400ల ఎకరాల్లో చెట్ల నరికివేత పనులపై దాఖలైన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు ఈ నెల 7కి వాయిదా వేసింది. ఈ భూమిని టీజీఐఐసీకి కేటాయిస్తూ ప్రభుత్వం గత ఏడాది జూన్ 26న జారీచేసిన జీవో54ను సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కె.బాబూరావు అనే వ్యక్తి, వట ఫౌండేషన్‌లు వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు(పిల్?) దాఖలు చేశాయి. గురువారం(ఏప్రిల్ 03) భోజన విరామ సమయంలో విచారణ చేపట్టాలంటూ హెచ్‌సీయూకి చెందిన విద్యార్థులతోపాటు మరొకరు తాజాగా మరో 2 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు.

# ఏపీలో నామినేటెడ్ పదవుల పండగ

మొదటిపేజీ తరువాయి

కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పోటీ చేశాయి. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటులో భాగంగా పలువురు సీనియర్లు ఎన్నిక వేళ.. సీట్లు వదులు కోవాల్సి వచ్చింది. అధికారంలోకి వచ్చిన అనంతరం నామినేటెడ్ పోస్టులు కట్టబెడతామంటూ వారికి హామీ సైతం ఇచ్చారు. ఇక సదరు ఎన్నికల్లో కూటమిలోని పార్టీలు మొత్తం 175కి 164 స్థానాలకు గెలుచుకున్నాయి. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా పలువురు సీనియర్ నేతలకు ఇప్పటికే విడతల వారిగా కీలక పోస్టులు కేటాయించింది. ఈ కేటాయింపుల్లో సైతం మిత్ర ధర్మం పాటీస్తూ చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఆ క్రమంలో ఏఎంసీ చైర్మన్ల పేర్లను ప్రకటించారు. మిగతా వారి పేర్లను సైతం మరికొద్ది రోజుల్లో ప్రకటించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

మొదటిపేజీ తరువాయి

ఎకరాల్లో పొగాకు పంట తడిసి ముద్దయ్యింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో 2 వేల క్వింటాళ్ల మొక్కజొన్నలు వరద నీటిలో మునిగి నష్టం వాటిల్లింది. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో అకాల వర్షానికి మిర్చి తడిసిపోయింది. కొత్తగూడలో వడగండ్ల వానతో 150 ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 250 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీటిలో 150 ఎకరాల్లో మామిడి, 93 ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్టుగా ప్రాథమిక అంచనాలు రూపొందించారు. మంత్రి సీతక్క ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో శుక్రవారం పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని, నష్ట పరిహారం ఇచ్చి ఆదుకుంటామన్నారు. పంట నష్టంపై తక్షణమే సర్వే మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడి తక్షణ సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు పరిశీలించారు.

## బర్డ్ ఫ్లూపై రంగంలోకి కేంద్రం

మొదటిపేజీ తరువాయి

సంబంధిత అధికారుల వద్ద తప్పనిసరిగా పౌల్ట్రీ ఫారాల వివరాలు నమోదుచేసుకోవాలని పౌల్ట్రీ యజమానులకు సూచించింది. దీనిపై కేంద్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ శుక్రవారం అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించి, ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. మన ఆహార భద్రతను, గ్రామీణ ప్రాంతాల జీవనోపాధికి.. పౌల్ట్రీ రంగాన్ని కాపాడుకోవడం కీలకమని ఆమె పేర్కొన్నారు. "ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ ఈసారి ఒక జాతీ జీవాల నుంచి మరో జాతి జీవాలకు కూడా సోకుతోంది. కోళ్లకే పరిమితం కాక.. అడవి పక్షులకు, కొన్ని ప్రాంతాల్లో పిల్లిజాతి జీవాలకు కూడా సోకుతోంది" అని సీనియర్ అధికారి ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని ఓ పౌల్ట్రీఫ్రామ్‌లో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన నేపథ్యంలో గురువారం 10 వేల కోళ్లను చంపేసిన వైద్యబృందం.. శుక్రవారం మరో 6 వేల కోళ్లను చంపి, లోతైన గోతిలో పాతిపెట్టింది.

## విద్యార్థులకు భవిష్యత్తు కల్పించాలి

యూనివర్సిటీలను కొందరు ప్రొఫెసర్లకు పునరావాస కేంద్రాలుగా మార్చవద్దని అన్నారు. ఈ సందర్భంగా వీసీలకు తమ వర్సిటీల్లో ప్రొఫెసర్ల కొరత, భవనాలు, ఇతర వసతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకురాగా.. వర్సిటీల అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వీసీలంతా వర్సిటీలవారీ సమస్యలు, ఉమ్మడి సమస్యలపై ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావుతో సమావేశమై చర్చించాలని, తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. రాష్ట్రంలో మెరుగైన విద్యావ్యవస్థ ఏర్పాటు కోసం సమగ్ర విధాన పత్రం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. విద్యా కమిషన్‌ను ఆదేశించారు. ఉత్తమ విద్యావ్యవస్థ కోసం ఎంత ఖర్చయినా వెనుకాడబోమని ప్రకటించారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల స్థాయిలో తీసుకురావాల్సిన మార్పులపై రూపొందించే విధాన పత్రం విషయంలో వివిధ సంఘాలు, ప్రముఖులతో చర్చించాలని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని, విద్యా వ్యవస్థలో తెలంగాణ అగ్రగామిగా ఉండేందుకు దోహదపడేలా సూచనలు, సలహాలు ఉండాలని అన్నారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్దే నా ధ్యేయం : పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

తొలిఅడుగు, కొండాపూర్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ఓయూ ప్రొఫెసర్స్ కాలనీ లో రూ. 60 లక్షల 70 వేల రూపాయల అంచనా వ్యయం తో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణము పనులకు కార్పొరేటర్ హమీద్ పటేల్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ... ప్రజల సంక్షేమం శేరిలింగంపల్లి నియోజకవర్గం కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం 60 లక్షల 70 వేల రూపాయల తో ఓయూ ప్రొఫెసర్స్ కాలనీ లో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీ వాసులకు ఉపశమనం లభించింది అని, మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీఠ వేస్తామని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా , అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిత్తానని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియజేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజీపడకూడదన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత , సుఖవంతమైన , మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయ శక్తుల కృషి చేస్తానని అన్నారు. రంగాలలో అభివృద్ధి చేస్తానని పీఏసీ చైర్మన్ గాంధీ చెప్పడం జరిగింది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పీఏసీ చైర్మన్ గాంధీ అధికారులను ఆదేశించడం జరిగింది. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని ,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని పీఏసీ చైర్మన్ గాంధీ వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌళిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, కొండాపూర్ డివిజన్ శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పీఏసీ చైర్మన్ గాంధీ పునరుద్ఘాటించారు.

శంకుస్థాపన చేసిన కార్యక్రమాల వివరాలు :




మంజూరైన అభివృధి పనుల వివరాలు ఓ.యూ ప్రొఫెసర్స్ కాలనీ లో రూ.60 లక్షల 70 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీ సీ రోడ్ల నిర్మాణం పనులకులి పైన పేర్కొన్న సీసీరోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన ఏఈ

**-పటాన్ చెరు ఇరిగేషన్ కార్యాలయంలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న అధికారులు**



తొలిఅడుగు, పటాన్ చెరు : లంచం... పేదల రక్తాన్ని జుర్రుకున్నట్లు ఎంతకూ ఆగడం లేదు. చిన్న స్థాయి అధికారి నుంచి ఉన్నత స్థాయి హోదాలో ఉన్న అధికారులు సైతం అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఏ మాత్రం అవకాశం ఉన్నా బల్ల కింద చేయిచాచి వసూలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనగా అనేకమైన అవినీతి కేసులు ఈ మధ్య వెలుగులో కి వస్తున్నాయి. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా ఎంతో కొంత ముట్టజెప్పనిదే పనులు కావన్నట్లుగా పరిస్థితి నెలకొంది. ఏసీబీ అధికారులు ఇప్పటి వరకు చేసిన దాడులు పట్టుకున్న అవినీతి అధికారుల లెక్కలు చూస్తే తెలుస్తుంది. ఇటువంటి ఘటనే సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు ఇరిగేషన్ ఏఈ ఏసీబీకి చిక్కారు. ఏకంగా ప్రభుత్వ కార్యాలయంలోనే లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎన్ వో సీ కోసం ఓ బాధితుడి వద్ద నుంచి లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. సదరు బాధితుడు సంతోష్ తన భూమి విషయంలో ఎన్ వో సీ కావాలని కోరారు. దీంతో ఏఈగా విధులు నిర్వహిస్తున్న రవికిషోర్ లక్ష రూపాయలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబిని ఆశ్రయించడంతో పక్కా పథకం మేరకు ఏసీబీ అధికారులు ఏఈని పట్టుకున్నారు.

## కైసర్ నగర్లో ప్రజా పాలనలో ఆగని కబ్జాల పరంపర



తొలి అడుగు,కుత్బుల్లాపూర్: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం గ్రామం కైసర్ నగర్ సర్వే నంబర్ 342 లోని ప్రభుత్వ భూములు కబ్జా చేసి పట్టపగలే అక్రమ నిర్మాణాలు చేయడుతూ లక్షలు, కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. కైసర్ నగర్ బురగ రాజన్న బస్తీ అంబేద్కర్ నగర్ (ప్రభుత్వ భూమిలో వెలసిన బస్తీ) ముందు గల సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా పదికి పైగా రూములు నిర్మించి, అదనంగా పదికి పైగా బేస్మెంట్ ల నిర్మాణాలు చేపట్టి స్థానిక రెవిన్యూ అధికారులకు సవాలుగా మారారు. ప్రస్తుతం నిర్మిస్తున్న అయిదు ప్లాట్ల నిర్మాణాల భూమి యాభై లక్షలకు కబ్జాదారుడు ఇక్కడి భూమిని అమ్మి సొమ్ము చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే తరుణంలో సోమవారం నాడు సుమారు అయిదు వందల గజాల ప్రభుత్వ భూమిలో బేస్మెంట్ ల నిర్మాణాలు చేపట్టి అందులో అక్రమంగా మట్టిని నింపుతూ స్థానిక విలేకరుల కెమెరా లకు చిక్కారు. ప్రధానంగా జగద్గిరిగుట్టలో కబ్జాలకు పాల్పడి అక్కడి నుండి సూరారం కు మకాం మార్చిన ఓ కాంగ్రెస్ కార్యకర్త ఎస్. ఎన్. రెడ్డి ఇక్కడి ప్రభుత్వ భూమిలో కార్యకలాపాలు కొనసాగించడం వెనుక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రజాపాలనలో ప్రభుత్వ భూములు కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వ భూముల రక్షణ కొరకు హైడ్రా ను ఏర్పాటు చేశారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి. అయినా కూడా సొంత పార్టీకి చెందిన ఓ గల్లీ నాయకుడు కొన్ని లక్షల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిలో పాగా వేషాడంటే మిగతా కబ్జాదారుల కు ఆదర్శంగా నిలిచే అవకాశం లేకపోలేదంటున్నారు స్థానిక ప్రజలు. గత బంగారు తెలంగాణ లో కొన్ని ఎకరాలు కబ్జా చేసి కోట్లు దండుకున్న కబ్జాదారులు కూడా తోకముడుచుకుని ఉన్నారు. అందుకు కారణం వారిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేయడమేనంటున్నారు ఇక్కడి జనం. అయినా కూడా ప్రస్తుతం కొందరు కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో ప్రభుత్వ భూములు కబ్జా చేస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్న ఎస్. ఎన్. రెడ్డి, అతడి అనుచరులపై ల్యాండ్ గ్రాబింగ్, క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రభుత్వ భూములు కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# కాసేపట్లో మళ్ళీ భారీ వర్షాలు.. ఆ ప్రాంతాల వారికి బిగ్ అలర్ట్

హైదరాబాద్,తొలి అడుగు,: తెలంగాణలో అకాల వర్షంతో పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. శుక్రవారం.. అంటే ఈ రోజు ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వానలు కురుస్తున్నాయి. రానున్న 2 గంటల్లో తూర్పు, దక్షిణ తెలంగాణల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇక హైదరాబాద్ మహా నగరంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఏప్రిల్ 03వ తేదీన తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. హైదరాబాద్లో మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షంతో మహానగరంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. నగరంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. దీంతో నగర జీవులు ఆఫీస్ ముగించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు నగరంలో ఎక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మరోవైపు వేసవి కాలం రావడంతో.. ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోయాయి. వాతావరణంలో తేమ శాతం కనిష్టానికి తగ్గిపోయిందని వాతావరణ శాఖ వారు వివరించారు. దీంతో ఓ వైపు ఎండలు, మరోవైపు ఉక్క పోతతో నగర జీవి ఓ విధమైన అసౌకర్యానికి గురయ్యాడు. అలాంటి వేళ.. ఒక్క సారిగా వాతావరణం మారడం.. దీనికి తోడు భారీగా వర్షం పడడంతో నగర ప్రజలు ఒకింత సాంత్వన చేకూరింది. అయితే ఈ వర్షాలు కురవడం..ఆగిన ఆనంతరం మళ్లీ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తాడనే ఓ విధమైన ఆందోళన నగర జీవుల మదిలో మెదులుతోంది. ఇక వర్షాలు కురిస్తే.. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు సీఎం సూచించారు. ఆ క్రమంలో ఎక్కడికక్కడ అప్రమత్తంగా ఉండాలని వారిని ఆదేశించారు.

# వీఆర్ఏ వారసులకు గ్రామ పరిపాలన అధికారి గా అవకాశం ఇవ్వాలి

**– వీఆర్ఏ వారసుల సిద్ధిపేటజిల్లా అధ్యక్షుడు గుడుమల్ల రాజలింగం**

తొలి అడుగు చిన్నకోడూరు, ఏప్రిల్ 04 : 61 సంవత్సరాల పైబడిన వీఆర్ఏ వారసుల సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు గుడుమల్ల రాజలింగం మాట్లాడుతూ గత ప్రభుత్వం లో వీఆర్ఎ లు 84 రోజుల సుదీర్ఘ సమ్మె పోరాట ఫలితంగా జీఓ 81 జీవో 85 జూలై 2013 లో విడుదల చెయ్యడం జరిగింది. కానీ ఎలక్షన్స్ రావడం అప్పుడున్న ప్రభుత్వం మారడం లాంటి పరిణామాలు జరిగి ప్రజా ప్రభుత్వం అయినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రావడం దరణిలో మార్పులు చేసి రెవిన్యూ వ్యవస్థ పటిష్టం చెయ్యాలని నిర్ణయం తీసుకుంటున్న సమయంలో 20 నెలలు గడిచిపోతున్నాయి అయినా చిరుద్యోగులైన వీఆర్ఎ వారసులకు మాత్రం ఇంకా నియామక ఉత్తర్వులు పెండింగ్ లోనే ఉన్నాయి జీవో . 81/2023 జీవో 85/2023 20 నెలలు గడుస్తున్నాయి ప్రజా ప్రభుత్వం వచ్చి 16 నెలలు గడుస్తున్నాయి. ప్రభుత్వం భూ భారతి చట్టం 2025 తర్వాత ఆర్డర్లు ఇస్తారని కోటి ఆశలతో ఎదురు చూస్తున్న 3797 కుటుంబాలు అలాగే ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి ఉండాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఉగాదికి గ్రామ పరిపాలన అధికారి(జిపీఓ) గతంలో సర్దుబాటు చేసిన వీఆర్వో మరియూ విఆర్ఎ ల నుండి గూగుల్ ఫాం లో ఆప్షన్స్ తీసుకోవడం జరిగింది. ఈ 3797 వీఆర్ఎ 61 నిండిన వారసుల వివరాలు కూడా ప్రభుత్వం సిసిఎల్ఎ ఐఎఫ్ఎంఎస్ పోర్టల్లో 20 నెలల క్రితమే పొందుపరిచారు కాబట్టి వీరికి కూడా గ్రామ పరిపాలన అధికారి నియామకాలలో అవకాశం కల్పించి నియామక ఉత్తర్వులు ఇవ్వాలి. అలాగే ఈ వారసులు కూడా దాదాపు 10-12 సంవత్సరాలుగా వారి తల్లిదండ్రుల స్థానంలో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నారు వీరికి అనుభవం కూడా ఉన్నది. జీవో వచ్చిన సందర్భంలో కుటుంబ సభ్యుల నుంచి నో అబ్జెక్షన్ అడిగిన విషయంలో ప్రభుత్వ ఉద్యోగ%శీ% అని ఆశతో కుటుంబ సభ్యులు వారికి ఉన్న ఆస్తుల్లో వాట వదులుకోవడం ఆస్తులు లేని వారు అప్పులు తెచ్చి ఇవ్వడంతో మానసిక ఒత్తిడికి గురై ఇప్పటివరకు దాదాపు 70 మంది వారసులు చనిపోవడం అలాగే వయో భారం తో దాదాపు 400 వరకు 61 నిండిన వీఆర్ లు చనిపోవడం జరిగింది. ఈ జీఓ రావడానికంటే ముందు 20555 మంది వీఆర్ ఏ లు గ్రామాల్లో పని చేసేవారు జీవో అనంతరం 16758 మంది విఆర్ఎ లు విద్యార్హతల ఆధారంగా ప్రమోషన్స్ పొందారు కానీ అదే జీవో లో మిగిలిన 3797 వీఆర్ ఏ లు ఇంకా మిగిలిపోయారు 20555 మంది వీఆర్ చేసిన పనినీ 3797 చేస్తూ పని ఒత్తిడి అలాగే ఈ ఉద్యోగం అనేది పార్ట్ టైమ్ అయినప్పటికీ ఫుల్ టైం చేస్తూ పని ఒత్తిడి కారణంగా మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ప్రభుత్వం జీవో నం 81 85 ప్రకారం వివిధ శాఖల్లోకి వెళ్ళిన వారినీ గ్రామ పరిపాలన అధికారులుగ తీసుకుంటున్నారు కాబట్టి అదే జీవో లో మిగిలిన 61 నిండిన 3797 మంది వీఆర్ఎఏ వారసులకు ఆర్డర్స్ పెండింగ్లో ఉన్నాయి ఆ పోస్టులు కూడా సూపర్ న్యూమరరీ వీఆర్ లకోసమే క్రియేట్ చేశారు కాబట్టి ఆ ఖాళీ అయిన స్థానాల్లో 61 నిండిన వీఆర్ఎ వారసులను నియమించాలి. ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## ఆయిల్ ఫామ్ పంట సాగుతో...
## రైతులకు అధిక దిగుబడి, ఆర్థిక ప్రయోజనం

**– పంట పొలాన్ని పరిశీలించి కోత ప్రారంభించిన చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి**



తొలిఅడుగు, గజ్వేల్, ఏప్రిల్ 04 : ఆయిల్ ఫామ్ పంట సాగుతో రైతులకు అధిక దిగుబడి, ఆర్థిక ప్రయోజనం ఉంటుందని గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్, గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా అక్కారం శివారులోని రైతు లక్ష్మణ్ సాగు చేసిన ఆయిల్ పంట మొదటి కోతను ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డితో కలిసి కోసిన సందర్భంగా వారు మాట్లాడారు. పంట సాగు చేసి నాలుగేండ్లు పూర్తయిన సందర్భంగా మొదటి కోత ప్రారంభించగా, మార్కెట్లో రూ 21వేలకు పైగా మద్దతు ధర రానున్నట్లు స్పష్టం చేశారు. ఈ పంట రైతులకు మంచి లాభదాయక పంట కాగా, ప్రభుత్వం నుండి మొక్కలకు, డ్రిప్ పరికరాలకు మరియు నాలుగేళ్ల పాటు పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన, ఇతర సబ్సిడీ ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట సాగులో అంతర పంటలు సాగు చేసి లాభం పొందవచ్చుని, అలాగే ఇతర నూనె గింజల పంటలు సాగుతో పోల్చితే తక్కువ భూమిలో ఎక్కువ దిగుబడి, నూనె ఉత్పత్తి పొందవచ్చని చెప్పారు. ముఖ్యంగా ఆయిల్ ఫామ్ పంట సాగు రైతులకు గణనీయమైన ఆదాయం అందించనుండగా, దేశవ్యాప్తంగా నూనె అవసరాలను తీర్చడానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఆయిల్ ఫామ్ పంట సాగుకు మన నేలలు అనుకూలం కాగా, పంటలు జీవవైద్యాన్ని కూడా పెంచుతాయని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఆయిల్ ఫామ్ పంట సాగు పై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఈఓలు జ్యోతి, మాధవి, పిల్డ్ అసిస్టెంట్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు 100 పడకల హాస్పిటల్ సిబ్బందితో రివ్యూ నిర్వహించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

తొలిఅడుగు, మణుగూరు, ఏప్రిల్ 04 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వంద పడకల హాస్పిటల్ సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు. అయన మాట్లాడుతూ మణుగూరు 100 పడకల హాస్పిటల్ కి అనేక గ్రామాల నుండి వైద్యం కొరకు వస్తుంటారని వారందరినీ కూడా సొంత కుటుంబ సభ్యులుగా ఆదరించి మెరుగైన వైద్యాన్ని అందించాలని హాస్పటల్లో సిబ్బంది కొరత ఉంది అని నా దృష్టికి రాగా ముఖ్యమంత్రి మరియు హెల్త్ మినిస్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఒప్పించి మణుగూరు 100 పడకల హాస్పిటల్ కి నూతన డాక్టర్లను సర్జన్లను నియమించడం జరిగిందని హాస్పిటల్ కి సంబంధించి సిబ్బందికి సంబంధించి ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. విద్యార్థి దశలో విద్యార్థి సంఘాల నాయకుడిగా పనిచేసినప్పుడే మణుగూరు కి ఏమైతే కావాలనుకున్నో అవి అన్ని సమకూర్చుతున్నామని తెలియజేశారు హాస్పటల్లో కాన్పులు వీలైనంత వరకు సాధారణ కాన్పులు అయ్యేవిధంగా డాక్టరులు కృషి చేయాలని తెలియజేశారు వేసవికాలంలో ప్రజలకు వడదెబ్బ ప్రమాదాలకు గురి కాకుండా ప్రజలకి అవగాహన కల్పించాలని డాక్టర్లు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ప్రజలు ఎవ్వరు కూడా ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్లి డబ్బులు వృధా చేసుకోవద్దని ప్రభుత్వ హాస్పిటల్లో మెరుగైన వైద్యం అందిస్తామని తెలియజేసిన పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు.ఈ కార్యక్రమంలో మణుగూరు 100 పడకల హాస్పటల్ సిబ్బంది,మణుగూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిరినకి నవీన్,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి,మహిళా మండల అధ్యక్షురాలు సౌజన్య,టౌన్ ప్రెసిడెంట్ శివ సైదులు,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్,మణుగూరు శివాలయం గుడి చైర్మన్ కూచిపూడి బాబు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,మహిళ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**– పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలి ఎమ్మెల్యే పాయం.**




# విద్యార్థుల పై అక్రమ కేసులను ఎత్తివేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కి వినతి

తొలిఅడుగు, జనగామ, ఏప్రిల్ 04 స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పూర్తి వివరాలు సేకరించి సంబంధిత అధికారులతో మాట్లాడతామని హామీ ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఉద్యమకారుల జేఏసీ ప్రధాన కార్యదర్శి విద్యార్థి జేఏసీ అధ్యక్షులు పిట్టల సురేష్ మాట్లాడుతూ జనగామ జిల్లా సాధనలో భాగంగా జనగామ జిల్లా ప్రజలు ఐక్యమత్యంగా పోరాటం చేసి జిల్లాను సాధించుకోవడం జరిగింది అందులో భాగంగా ఉద్యమకారుల పైన మరియు విద్యార్థుల పైన నమోదైన కేసుల పైన ఇంకా కోర్టుకు వెళ్తున్నామని మరి ముఖ్యంగా విద్యార్థుల పైన కేసులు కావడం ద్వారా వారు పై చదువులకు ఇబ్బంది పడుతున్నారని ఇతర ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నారని కొంతమంది సాధారణ జీవితం గడిపే వ్యక్తుల పైన అక్రమ కేసులు పెట్టడం ద్వారా వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని కావున వీరిపైన ఉన్నటువంటి కేసు ఇప్పటికైనా తొలగించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మరియు విద్యార్థులకు నోముల శ్రావణ్. తుంగ కౌశిక్ .వెంపటి అజయ్. వినోద్ నాయక్ అనిల్ ఈశ్వర్ సాయి చందు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

మహోన్నత పార్లమెంటేరియన్

భారత దేశ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేత జగ్జీవన్ రామ్. అతి చిన్న వయస్సులో (27 ఏళ్లకే) శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యి రికార్డు సృష్టించిన ప్రజానాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, బాబూ జగ్జీవన్ రాం. పోలిటికల్ కింగ్ మేకర్‌గా రాజకీయంలో రాణించి, అధికారం కోసం కాకుండా ప్రజా శ్రేయస్సు కోసమే పనే చేసిన మహోన్నత వ్యక్తిత్వం ఆయన సొంతం. యాభై ఏళ్ళు పార్లమెంట్‌లో సభ్యునిగా కొనసాగిన సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం, షాబాద్ జిల్లా, ఛాందా గ్రామంలో శిబిరం, బసంతి దేవి దంపతులకు జగ్జీవన్ జన్మించారు. ఆయన ఒక పేద దళిత కుటుంబంలో జన్మించడంతో ఎన్నో అవమానాలను, ఛీత్కారలను ఎదుర్కొన్నారు. చిన్ననాడే తండ్రి చనిపోవడంతో సాంఘిక, ఆర్థిక ఇక్కట్ల మధ్య తల్లి వసంతీదేవి సంరక్షణలో తన చదువు కొనసాగించారు. రాత్రింబవళ్ళు భోజ్‌పురితో పాటు హిందీ, ఇంగ్లీషు, బెంగాలి, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్, కలకత్తా విశ్వ విద్యాయం నుంచి డిస్టింక్షన్‌లో బిఎస్సీ డిగ్రీ పూర్తి చేసి పట్టభద్రు డయ్యారు. పీజీ చదువు పూర్తి చేశారు. కార్మికుల కోసం పోరాడి 35వేల మంది కార్మికులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి అనేకమంది జాతీయ నాయకుల దృష్టిలో పడ్డారు. ఆయన జీవితకాలం 78 ఏళ్ళు అయితే అందులో 52 ఏళ్ళు రాజకీయ జీవితం గడిపారు. 1952లో భారత రిపబ్లిక్ తొలి లోక్‌సభ ప్రవేశించిన జగ్జీవన్‌రామ్ వరుసగా ఎనిమిది సార్లు గెలిచారు. ఏకధాటిగా 33 సంవత్సరాలు కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన ప్రత్యేకత చాటుకున్నారు. మొదటి శ్రేణి పార్లమెంట్ రియన్‌గా నిలిచారు. మంత్రి మండలిలో అతి చిన్న వయసుడ్కెన జగ్జీవన్‌రామ్‌ను అందరూ 'బేబి మినిస్టర్' అని పిలిచేవారు. ప్రజలంతా ప్రేమతో 'బాబుజీ' అని పిలిచేవారు. వ్యవసాయ శాఖ మంత్రిగా, ఆహార శాఖ మంత్రిగా, రైల్వే మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఎన్నో సేవలనందించిన ప్రగతిశీలి ఆయన. దామోదరం సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చెయ్యటంలో కీలకపాత్ర పోషించారు. 1942లో కాంగ్రెస్ లో చేరి, జగ్జీవన్ 1969లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1977లో ఇందిరా గాంధీతో విభేదించి పార్టీ నుంచి బయటకు వచ్చి 'ప్రజాస్వామ్య కాంగ్రెస్' పార్టీ ఏర్పాటు చేశారు. ఇంద్రాణిదేవితో బాబుజీకి 1935 జూన్ 1న వివాహం జరిగింది. ఇంద్రాణి కూడా స్వాతంత్ర్య సమరయోధురాలు. ఆయన కుమార్తె మీరాకుమార్ తండ్రి ఆదర్శాలతోనే పెరిగి, ఆయన బాటలోనే కేంద్రమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా దేశానికి సేవలందించారు. బాబుజీ గొప్ప రచయిత అన్న సంగతి చాలా మందికి తెలియదు. ఆయన హిందీలో, ఇంగ్లీషులో రచనలు చేశారు. "భారత దేశంలో కులం సవాళ్ళు", " జీవన సరళి వ్యక్తిత్వ వికాసం" అను రెండు విశిష్ట గ్రంథాలను రాశారు. ఆయన గొప్ప అధ్యయనశీలి. ఉజ్జయినిలోని విక్రమ విశ్వ విద్యాయం 1967లో జగ్జీవన్‌రామ్‌కి 'డాక్టర్ ఆఫ్ సైన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన సేవను మెచ్చిన కాన్పూర్ విశ్వవిద్యాయం 1968లో డాక్టరేట్‌తో సత్కరించింది. జగ్జీవన్ రామ్ అమూల్యరత్నం" అని గాంధీ ఒక సందర్భంలో రాశారు. 1986 జూలై 6వ తేదీన బాబూజీ తన తుదిశ్వాస విడిచారు. బాబు జగ్జీవన్ రామ్ వరుసగా ప్రజాప్రతినిధిగా, భారత దేశంలో ఎక్కువ కాలం పనిచేసిన క్యాబినెట్ మంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన కేంద్ర కార్మిక మంత్రిగా 1946 నుండి 1952 సంవత్సరం వరకు ఉన్నారు. ఆయన 1952 నుండి 1956 సంవత్సరం వరకు కేంద్ర సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1956 నుండి 1962 వరకు కేంద్ర రవాణా, రైల్వే శాఖ మంత్రిగా పనిచేశారు. 1962 నుండి 1963 సంవత్సరం వరకు ఆయన కేంద్ర రవాణా మరియు సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1966 నుండి 1967 సంవత్సరం వరకు కేంద్ర కార్మిక, ఉపాధి మరియు పునరావాస శాఖ మంత్రిగా పని చేశారు. 1967 నుండి 1970 వరకు కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. 1970-1974, 1977 - 1979 కేంద్ర రక్షణ మంత్రిగా ఉన్నారు. 1974 నుండి 1977 వరకు కేంద్ర వ్యవసాయ, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నారు. సెప్టెంబర్ 1976 నుండి 1983 ఏప్రిల్ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షుడిగా పని చేశారు. భారత ఉప ప్రధానమంత్రిగా, 1977 మార్చి 24 నుండి 1979 జూలై 28 వరకు విధులు నిర్వర్తించారు.

# శ్రీరామ నవమి ఏర్పాట్లు, కరకట్ట పనులను పరిశీలించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తొలిఅడుగు, మణుగూరు,ఏప్రిల్ 04 : భద్రాచలం కూనవరం రోడ్డు కరకట్ట పనులు మరియు శ్రీరామ నవమి పనులను పరిశీలించి అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో రివ్యూ మీటింగ్ పాల్గొని 6వ తారీకు జరిగే శ్రీరామనవమి, 7వ తారీకు జరిగే శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,భద్రాచలం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మరియు రాష్ట్ర అటవీ శాఖ చైర్మన్ పొదెం వీరయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, రామాలయం టెంపుల్ ఈవో యల్. రమాదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# 250కిలోల గోటి తలంబ్రాలను అందజేసిన రామకోటి రామరాజు

- రామయ్య కల్యానానికి లక్షల మంది భక్తుల తలంబ్రాలు
- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొన్న భక్తులు
- రామకోటి రామరాజు కృషి, పట్టుదల అమోఘమన్న
- భద్రాచల దేవస్థాన ఏఈవో శ్రావణ్ కుమార్



తొలిఅడుగు, గజ్వేల్, ఏప్రిల్ 04 : భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణం కోసం గోటి తలంబ్రాల దీక్షలో పాల్గొనే అవకాశాన్ని సిద్దిపేట జిల్లా గజ్వేల్ కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం సంస్థకు మూడోసారి అవకాశం ఇచ్చారు. సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు గారు ప్రతి వ్యక్తిలో రామభక్తి నెలకొల్పాలని గత 45రోజుల నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, గ్రామాన వేలాది మంది భక్తులచే రామనామ స్మరణ చేపిస్తూ గోటితో వడ్లను ఓలిపించి 250కిలోల పైగా గోటి తలంబ్రాలను సిద్ధం చేపించి రామభక్తిని చాటుకున్నాడు. శుక్రవారం నాడు భద్రాచల దేవస్థానంలో కళాశాలతో ఊరేగింపు చేసి ఏఈవో శ్రవణ్ కుమార్ గారికి దేవస్థానంలోనే తలంబ్రాలకు ప్రత్యేక పూజ జరిపి రామకోటి రామరాజు అందజేశారు. ఈ సందర్భంగా భద్రాచల దేవస్థాన ఏఈవో శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ గత 26 సంవత్సరాల రామకోటి రామరాజు కృషి పట్టదల అమోఘమన్నారు. లక్షల మంది భక్తులచే రామనామం లిఖింపజేపించమే కాకుండా గత 3సంవత్సరాల నుండి కోటి తలంబ్రాల దీక్షకు శ్రీకారం చుట్టి గ్రామ, గ్రామాన్ని తట్టి అద్భుతంగా నిర్వహించిన రామకోటి రామరాజును ఘనంగా సన్మానించారు. ఎన్నో కష్టాలను అనుభవిస్తున్న లెక్కచేయకుండా రాముని కోసమే తన జీవితాన్ని దారపోసిన గొప్ప రామభక్తుడు అని కొనియాడారు. అక్కడ ఉన్న ముత్యాల తలంబ్రాలలో రామకోటి రామరాజు తీసుకెళ్లిన గోటి తలంబ్రాలు కూడా కలిపారు.

# రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్న బిజెపి

- కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పడిపోవడం ఖాయం
- కాంగ్రెస్ మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్




తొలి అడుగు, చిన్న కోడూరు, ఏప్రిల్ 04 : జై భీమ్ జై బాపు జై సమ్ విధన్ నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాదయాత్ర 2వ రోజు చిన్నకోడూరు మండలంలోని కస్తూరిపల్లి, సికింద్లపూర్, మల్లారం గ్రామాల్లో చిన్నకోడూరు కాంగ్రెస్ మండల అధ్యక్షులు మీసం మహేందర్ ఆధ్వర్యంలో కొనసాగించడం జరిగింది ఈ కార్యక్రమానికి మండల కోర్డినేటర్లుగా నిమించినటువంటి సిద్దిపేట కౌన్సిలర్ సాకీ ఆనంద్, జిల్లా ప్రాధానకార్యదర్శి మహమ్మద్%ఎజ% షాబోద్దీన్ లతో కలిసి మాట్లాడుతు ప్రపంచం దేశాల అన్నిటిలో కన్నా అతి పెద్ద రాజ్యాంగాన్నీ నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు రచించిన రాజ్యాంగాన్ని మరియు అంబేద్కర్ గారిని పార్లమెంట్ లో బీజేపీ ఎంపీ అమిత్ షా అవమానించి రాజ్యాంగాన్ని మార్చుతామని కుట్ర చేస్తున్న బిజెపి పార్టీని గ్రామస్థాయిలోనే బొంద పెట్టాలని ఈ పాదయాత్ర సందర్భంగా పిలుపునిచ్చారు అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పేద మధ్యతరగతి కుటుంబాలు సన్న బియ్యం తినాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి గారు సన్న బియ్యం పథకం తీసుకువచ్చి పేద ప్రజల కడుపు నింపుతుంటే గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను ఓర్వలేక బిజెపి నాయకులు సోషల్ మీడియాలో సన్న బియ్యం కేంద్ర ప్రభుత్వమే ఇస్తుందని గ్లోబల్స్ ప్రచారం చేయడాన్నీ ఖండించారు మీ బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాలలో సన్న బియ్యం ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు, అంతేకాకుండా అన్ని మతాలకు ప్రతీకైనటువంటి భారతదేశంలో కులాల మధ్య మతాల మధ్య చిచ్చులు పెట్టుకుంటూ రాజకీయ పబ్బం గడుపుతున్న బిజెపి పార్టీని రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు బొంద పెడతారని తెలియజేశారు. ఇతర పార్టీల మద్దతుతో కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బిజెపి ప్రభుత్వం త్వరలోనే కూలడం ఖాయమని జోష్యం చెప్పారు ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సందబోయిన పరశురాం, వికలాంగుల విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సింగరాల రాజు,ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్,మండల కన్వీనర్ కొమ్ము ప్రశాంత్, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి పాకాల భూపతిరెడ్డి, ఫిషర్మెన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట్, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి యూసఫ్,యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ఉడుత ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ చిన్నకోడూరు మండల మాజీ అధ్యక్షులు ఉడుత జయంత్, నాయకులు నముండ్ల వినోద్ ఉడుత వేణు, మాసం శేషు, మీసం రాకేష్, నాగరాజ్,తిరుపతి రెడ్డి, తాళ్లపల్లి రాజు, నక్క రాజు, దేవరాయ శేఖర్,సంపత్, రాములు, మహేందర్ రెడ్డి, భాస్కర్, బాలెపు రాజిరెడ్డి, దామోదర్ రెడ్డి, కొమ్ము ఎల్లయ్య, రాజా వర్ధన్ రెడ్డి,ఎగుర్ల రాములు, పంతం శ్రీనివాస్,శ్రీకాంత్, అనిల్,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంలో 60 సీట్లు సాధించిన ఎక్సలెంట్ విద్యార్థులు.!

తొలిఅడుగు, జూలూరుపాడు, ఏప్రిల్ 04 : జూలూరుపాడు నందు ఐదో తరగతి ప్రవేశానికి గురుకుల పరీక్షలలో అత్యధిక సీట్లు సాధించిన 60 మంది ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు కరస్పాండెంట్ ఆరబోయిన హుస్సేన్ వారికి అభినందనలు తెలియజేశారు

సాయి ఎక్సలెంట్ విద్యాలయం నందు ఫిబ్రవరి 23 న గురుకుల ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహించారు ఈ ఎంట్రన్స్ పరీక్ష నందు 60 మంది విద్యార్థులకు పైగా సీట్లు సాధించారు ఈ సందర్భంగా కరస్పాండెంట్ హుస్సేన్ మాట్లాడుతూ జూలూరుపాడు మండల కేంద్రం నందు సాయి ఎక్సలెంట్ విద్యాలయం ప్రతి సంవత్సరం నవోదయ గురుకులంలో సాయి ఎక్సలెంట్ విద్యాలయం సీట్లు సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. అదేవిధంగా మా సంస్థ నందు ప్రతి విద్యార్థికి ప్రత్యేక శిక్షణతో పాటు గ్రామస్థాయిలో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామన్నారు కాంపిటేటివ్ ఎగ్జాంలో సీట్లు సాధించి జిల్లా స్థాయిలో మంచి గుర్తింపు ఇచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతేకాకుండా తక్కువ ఫీజు తో నాణ్యమైన విద్యను అందిస్తున్న ఘనత మా సాయి ఎక్సలెంట్ స్కూల్ లో మాత్రమే సాధ్యం అని గర్వంగా తెలియజేస్తున్నాము 2025..26నుండి విద్యా సంవత్సరానికి గాను సీబీఎస్ఈ. కేరళ టీచర్స్




తో విద్యా బోధన సాగిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జై శివకుమార్ , ఎకడమిక్ డైరెక్టర్ బి సరిత, ఉపాధ్యాయుని .ఉపాధ్యాయులు రాంబాబు ,మృదుల్, అనిత, %ూా%. సరిత, నబీన ,భాను, పావని, కళ్యాణి ,దుర్గ భవాని ,నవ్య ,ప్రశాంతి, రజిత ,నందిని, పద్మ ,సత్యవతి ,జమున ,అరుణ ,యోగా టీచర్ ప్రమీల ,మరియు తల్లిదండ్రులు నవీన్ రెడ్డి ,విద్యార్థి ,విద్యార్థినులు పాల్గొన్నారు.

# దళితబంధు అక్రమార్కులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

**- దళిత బంధు నిధులను దుర్వినియోగం చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి**

తొలి అడుగు, జూలూరుపాడు, ఏప్రిల్ 04 : మండలం లో విలేకరుల సమావేశంలో మాల మహానాడు మండల అధ్యక్షులు బడుగు వీరస్వామి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం మండల వ్యాప్తంగా ఉన్న దళితులు ఆర్థికంగా ఎదగాలని ఒక కుటుంబానికి 10 లక్షలు చొప్పున ఇచ్చింది ఇలా ఇవ్వగా దళితులు దళిత బంధు నిధులను ద్రునియోగం చేసి షాపులు మూసివేసి ఇచ్చిన వాహనాలను అమ్ముకొని మరల పేదవారిగానే మిగిలిపోతూ ప్రభుత్వం నుంచి వచ్చే స్కీముల కోసం ఎదురు చూడటం కరెక్టేనా పద్ధతి కాదు కావున తక్షణమే ఎవరైతే దళితులు దళిత బంధు నిధులు దుర్వినియోగం చేశారో ఎంక్వయిరీ చేసి దుర్వినియోగం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుచున్న అదే కాకుండా దళిత బంధు నిధులను దుర్వినియోగం చేసి కూడా మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు అన్నట్లుగా మాట్లాడుతున్న దళితులపై చర్యలు తీసుకొని మరల ఇంకెవరు ఇలాంటి అక్రమాలకు పాల్పడకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని నేను డిమాండ్ చేస్తున్నామన్నారు.

# పంచాయతీ కార్మికులకు ఉరితాడుగా ఉన్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి.!

తొలిఅడుగు, ఏప్రిల్ 04 : పంచాయతీ కార్మికులకు ఉరితాడుగా ఉన్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని టి యు సి ఐ అనుబంధం తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్

జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలో పడమట నరసాపురం గ్రామంలో యూనియన్ జిల్లా కోశాధికారి ధనవంతురావ్ అధ్యక్షతన జరిగిన గ్రామపంచాయతీ వర్కర్స్ మండల స్థాయి జనరల్ బాడీలో ఆయన మాట్లాడుతూ



రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీల్లో సుమారు 60,000 మంది పంచాయితీ కార్మికులు మల్టీపర్పస్ విధానంలో పనిచేస్తున్నారని, వీరికి నెలకు కేవలం 9500 /- రూపాయలు మాత్రమే ఇస్తున్నారని అవి కూడా నెల నెలా ఇవ్వటం లేదని అన్నారు. ఈ 9500/- రూపాయల జీతం తో ఆ యొక్క కార్మికుని కుటుంబం ఎట్లా బ్రతుకుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

. గతంలో %ు=ూా%, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ వేతనాలు ఇచ్చి గ్రామ పంచాయితీ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. గ్రామపంచాయితీ లో పనిచేస్తున్న వర్కర్స్ అత్యంత పేదవారని, సామాజికంగా వెనుకబడ్డ వర్గాల వారని ఇలాంటి వారికి చేయూతనిచ్చి ఆ కుటుంబాలు అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని అన్నారు.

జీవో నెంబర్ 60 ప్రకారం 15000 /- , 19500/- , 22,750/- , చొప్పున గ్రామ పంచాయితీ వర్కర్స్కు కు పెంచి అమలు చేయాలని. మల్టీ పర్పస్ జీవో 51రద్దు చేసి,గ్రామ పంచాయితీ లో పనిచేసే ప్రతి కార్మికునికి %ూఖీ, జుూ×% , గ్రాట్యూటీ , 10 లక్షల ఇన్సూరెన్స్ చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, సాధారణ మరణానికి 5 లక్షలు ఇవ్వాలని. గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని. గ్రామపంచాయతీ కార్మికులకు అన్ని రకాల సెలవులు అమలు చేయాలని. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని అన్నారు. ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గ్రామపంచాయతీ కార్మికులకు కూడా నెల నెలా వేతనాలు వ్యక్తిగత అకౌంట్లో జమ చేయాలని కోరారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (%ుఖజ×% అనుబంధం), గ్రామపంచాయతీ కార్మికులకు అండగా నిలిచి, వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. పంచాయితీ కార్మికుల పక్షాన న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమించిందని, ఈ నేపథ్యంలో ఏప్రిల్ 5న నారాయణపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర రెండవ మహాసభలు నిర్వహించి, గత పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోబోతుందని అన్నారు. రాష్ట్ర మహాసభలలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని గోపాలరావు కోరారు. కార్యక్రమంలో జిల్లా అఖిలభారత ప్రగతిశీల ఐక్య రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోద్ ధర్మ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ప్రజల పరిస్థితులు ధైర్యమైన స్థితిలో ఉన్నాయని, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులను కాల రాస్తున్నారని ఆవేదన వ్యక్తం 44 లేబర్ చట్టాలను నాలుగు కోళ్లుగా మార్చి కార్మిక వర్గానికి హక్కులు లేకుండా చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. రైతాంగానికి నష్టం కలిగించే చట్టాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఆందోళన చేసి రైతాంగ వ్యతిరేక చట్టాలను వెనక్కి కొట్టిన ఘనత రైతాంగ పోరాటాలకున్నదని ఆ పోరాటాలు స్ఫూర్తితో కార్మిక వర్గం ఉద్యమించాలని ,కార్మికుల హక్కుల కోసం జరుగుతున్న పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో టి యు సి ఐ ఏరియా ఉపాధ్యక్షులు రాయల సిద్దు

, నాగు తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో యూనియన్ మండల నాయకులు వినోద్ రజిని నరసింహారావు, రాంబాబు వెంకటేష్ ఈరు మురళి సురేష్ సంజీవరావు సేవ్య, నవీన్ రామకృష్ణ, నరసింహారావు రాంబాబు సుజాత కళావతి పరాంగిణి, తదితరులు పాల్గొన్నారు.

# జై బాపు,జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమం




తొలిఅడుగు, జమ్మికుంట అడుగు, ఏప్రిల్ 04 : జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం లో ఒకటో వార్డు రెండో వార్డు లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టడం జరిగింది. నాయకులు మాట్లాడుతూ అహింసా పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి స్వాతంత్రం సిద్ధింపచేసిన మహాత్మా గాంధీతో పాటు ప్రజల స్వేచ్ఛ సమానత్వం కోసం రాజ్యాంగం రచించిన అంబేద్కర్ లను బిజెపి ఆర్ఎస్ఎస్ అవమాన పరుస్తున్నాయని మండిపడ్డారు.

పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం అన్నారు.. మహనీయుల ఆశయాలను కాపాడటంతో పాటు ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్ అగ్రనేత లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ నిర్వహిస్తుందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడడానికి ప్రజల హక్కులను పరిరక్షించడానికి దేశవ్యాప్తంగా అన్ని పట్టణాలు గ్రామాలలో సామాజిక న్యాయం ఐక్యత కల్పించే ప్రధాన ఉద్దేశంతో రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్రీయ పాదయాత్ర చేస్తున్నామని అన్నారు. ఈ పాదయాత్ర ద్వారా రాజ్యాంగ గొప్పతనాన్ని ప్రజలకి తెలియజేయడంతో పాటు మహనీయులను స్మరించేందుకు వారు చేసిన సేవలోను నేటి తరానికి తెలియజేయపరిచే ఉద్దేశంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి ఇల్లంతకుంట దేవస్థాన మాజీ చైర్మన్ దేశిని కోటి మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న మారేపల్లి బిక్షపతి పొనగంటి మల్లయ్య గార్ల తో పాటు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగ శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాత సత్యం ఎండి సలీం పోతుల శ్రీనివాస్ ఎండి సంజు పాతకాల అనిల్ పంజాల అజయ్ దొడ్డే నవీన్ రాజకుమార్ మైస మహేందర్ మేడి మహేందర్ విజయ్ మారేపల్లి ఆంజనేయులు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# జూమ్ మీటింగ్ గాంధీభవన్ కనెక్ట్ సెంటర్




తొలిఅడుగు, ధర్మపురి ప్రతినిది ఏప్రిల్ 04 : శుక్రవారం జరిగిన గాంధీ భవన్ కరెక్ట్ సెంటర్ జూమ్ మీటింగ్లో నేరుగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారికి ఇందిర ఇండ్లు అన్ని గ్రామాలకు మంజూరు ఇవ్వాలని రిక్వెస్ట్ చేయడం జరిగింది అట్టి విషయంలో మహేష్ కుమార్ గౌడ్ గారు సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా జై బాపు జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్ర గురించి వివరించడం జరిగింది.

## సెకండ్ల వ్యవధిలో వృద్ధుడిని కాపాడిన (రక్షక్) ఎస్సై శ్రీనివాస్ నాయక్..!

**- ఆదుకున్న 100 కాల్ తో కనురెప్ప పాటుతో అప్రమత్తమైన అనపర్తి పోలీస్..**

**- సమయానికి స్పందించి ప్రాణము నిలిపిన అనపర్తి పోలీస్..**



తొలి అడుగు, తూర్పుగోదావరి జిల్లా, ఏప్రిల్ 04 : అనపర్తి అనారోగ్య సమస్యలను తట్టు కో లేక అనపర్తి గ్రామానికి చెందిన సత్తి రామారెడ్డి అనే వృద్ధుడు అనపర్తి ధరణికోట శివాలయం వద్ద ఎర్ర కాలువ రేవులో దిగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు వృద్ధుడు మునుగుతూ తేలుతూ కాలువలో కొట్టుకుపోతుండగా కెనాల్ రోడ్డుపై వెళ్తున్న కొందరు స్పందించి 100 కాల్ చేశారు. కాల్ సెంటర్ వారు వెనువెంటనే స్పందించి అనపర్తి పోలీసులకు సమాచారం అందించడంతో సమాచారం అందుకున్న అనపర్తి పోలీస్ స్టేషన్ రైటర్ శంకర్ సదురు సమాచారాన్ని ఎస్సై శ్రీను నాయక్ కు తెలియపరచి వెంటనే కాలువలో కొట్టుకుపోతున్న వ్యక్తిని ఇటికల భట్టిలో పనిచేస్తున్న వారి సహకారంతో స్టేషన్ రైటర్ శంకర్ మరియు అనపర్తి సబ్ ఇన్స్పెక్టర్ శ్రీను నాయక్ బయటికి తీసి కాపాడి సపరియలు చేసి బట్టలు తొడగించి 108 అంబులెన్స్ లో గవర్నమెంట్ హాస్పిటల్ కు పంపించి ప్రతిమ చికిత్స చేయించినారు,ఎస్ఐ శ్రీను నాయక్,స్టేషన్ రైటర్ శంకర్, 108 సిబ్బందికి సమాచారం అందించి వెనువెంటనే కాలువ వెంబడి వృద్ధుడు కొట్టుకుపోతున్న ప్రాంతానికి చేరుకొని అతడిని ఒడ్డుకు చేర్చి ప్రాణాలు నిలిపారు.

అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది వృద్ధుడికి ప్రధమ చికిత్స అందించి అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించడంతో వృద్ధుడు ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. 100 కాల్ అందుకోగానే స్పందించిన సిబ్బందిని వెనువెంటనే స్పందించిన ఎస్సై శ్రీను నాయక్ రైటర్ శంకర్ లను మరియు బట్టిలో పనిచేస్తున్న కార్మికులును పలువురు అభినందించారు.

## ఏఎస్సై రమణారెడ్డికి ఎస్సైగా పదోన్నతి..



తొలి అడుగు దినపత్రిక : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఏప్రిల్ 04 : మండల కేంద్రమైన ఆలమూరు పోలీస్ స్టేషన్ లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రమణారెడ్డి ఎస్సైగా పదోన్నతి పొందారు. ఇటీవల ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ ఉత్తర్వులు మేరకు పదోన్నతి లభించడంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి కృష్ణారావు రమణారెడ్డిని రావులపాలెం అదనపు ఎస్సైగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం రమణారెడ్డి రావులపాలెం అదనపు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. సిఐ శేఖర్ బాబు ఆయనను ఆహ్వానించి అభినందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతాధికారుల ఆదేశానుసారం నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగంలో పనిచేసే ప్రతి ఒక్కరికి ఉన్నత స్థాయికి చేరే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన నాటి నుండి ఉన్నతాధికారుల ఆశీస్సులతోనే పదోన్నతులు పొందుతున్నానని చెప్పారు. అలాగే గత 38 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో రమణారెడ్డి విధులు నిర్వహించి సుదీర్ఘ సర్వీస్ లో ఎలాంటి రిమార్కులు లేకుండా సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా పదోన్నతి పొందిన ఆయనను పలువురు ఉన్నత స్థాయి అధికారులతో పాటుగా మండల స్థాయి నాయకులు, సిబ్బంది అభినందించారు

# రాష్ట్ర ప్రభుత్వం ప్రవీణ్ పగడాల మరణం మీద ఎంక్వయిరీ చేయాలి.




తొలి అడుగు దినపత్రిక, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఏప్రిల్ 04 : తన మరణం ద్వారా క్రైస్తవ సమాజాన్ని ఏకం చేసిన పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబానికి ప్రతి క్రైస్తవ కుటుంబం అండగా నిలవాలని అపోస్థలిక్ సహవాస సంఘాల చైర్మన్, ప్రముఖ దైవజనులు డాక్టర్ అంగర ప్రసాద్ పాల్ అన్నారు. ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి శాంతి కలగాలని కోరుతూ మండపేట పట్టణం లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వందలాది మంది క్రైస్తవ విశ్వాసులు పాల్గొని ప్రవీణ్ ప్రగాడాల కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ పాల్ మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతి పై క్రైస్తవ సమాజానికి అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కొందరు ప్రవీణ్ పగడాలపై సోషల్ మీడియా లో అసత్య ప్రకటనలు చేస్తూ క్రైస్తవుల మనోభావాలను గాయపరుస్తున్నారన్నారు. దీనిని తామంతా ముక్త కంఠం తో వ్యతిరేకిస్తున్నామన్నారు. అటువంటి వారిపై కేసులు నమోదు చేసి రాష్ట్రం లో మత విద్వేషాలు చెలరేగకుండా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటన్నారు. అయితే ఆయన మరణం తరువాత కూడా క్రైస్తవ సమాజాన్ని ఏకం చేస్తూ క్రీస్తు పరిచర్య చేస్తూనే ఉన్నారన్నారు. ఇటువంటి ఘనత ఆయనకే చెందిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్ధించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దూళి జయరాజు మాదిగ, కౌన్సిలర్ సవరపు సతీష్, పాస్టర్ లు ఆర్. ప్రభుకుమార్, సుధాకర్, జాన్, గాబ్రియేల్, జోషెఫ్, విజయ్ కుమార్, చంద్ర శేఖర్, ఆత్మకుమార్, క్రిస్ఫర్, అన్నదాత కొల్లి విశ్వనాథం, ఆనంద్, ప్రిన్స్ డేవిడ్ పాల్, ఆర్.డేవిడ్, కిషోర్, సీఎఫ్ఎం సంగీత కళాకారుల బృందం, అపోస్తలిక్ కింగ్స్ టెంపుల్ విశ్వాసులు, యూత్ సభ్యులు ప్రజలు, అనేక మంది దైవ జనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## త్వరలో ఫేజ్ టూ ఇళ్ళు ఇస్తాం.... చైర్ పర్సన్ రాణి...



తొలి అడుగు దినపత్రిక, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఏప్రిల్ 04 : మండపేట గొల్ల పుంత టిడ్కో అపార్ట్మెంట్ రెండో పేజ్ లబ్ధిదారులకు వారి అపార్ట్మెంట్లు త్వరలో అందజేస్తామని మండపేట పుర పాలక సంఘం చైర్ పర్సన్ పతి వాడ నూక దుర్గా రాణి పేర్కొన్నారు.

మండపేట పట్టణం 20వ వార్డు టిడ్కో ఫేజ్ -1 లో మిగిలిన లబ్ధిదారులకు ప్లాట్లు అప్పగించే కార్యక్రమాన్నీ మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరిశీలించారు.గురువారం టిడ్కో సముదాయాల వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె సందర్శించి ప్లాట్లు అప్పగింత ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడ్కో ఫేజ్-1 లబ్ధి దారులు ఎవరైనా తమ ప్లాట్లను స్వాధీనం చేసుకోకపోతే వెంటనే అధికారులకు సంబంధిత పత్రాలు సమర్పించి స్వాధీనం చేసుకోవాలన్నారు.లబ్ధిదారుల ం తమ ఇళ్లను పరిశీలించుకొని చేయవలసిన మరమత్తులు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. త్వరలోనే ఫేజ్ -2 ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ టి.వి.రంగారావు,మేనేజర్ హరి మోహన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. శ్రీనివాస్,అసిస్టెంట్ ఇంజనీర్లు డి. పవన్ కుమార్, బి.ఆంజనేయులు మెప్మా సి ఎం ఎం సుజాత,టిడ్కో సిబ్బంది, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, వార్డు వెల్ఫేర్ కార్యదర్శులు,వార్డు ఎమినిటీ కార్యదర్శులు ఆర్.పి.లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ చేసిన దేశ ద్రోహపు చర్యలను సమాజానికి వివరిస్తం.

**-జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పేరుతో చేస్తున్న యాత్రలు బూటకం..బిజెపి**

**- జిల్లా అధికార ప్రతినిధి మద్రిపెల్లి సత్యమ్..**

తొలిఅడుగు, ధర్మపురి ప్రతినిది, ఏప్రిల్ 04 : గొల్లపెల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్. అంబెడ్కర్ గారిని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా గారు అవమానించారని ఆయనను కేంద్ర మంత్రివర్గం నుండి తొలగించాలని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న పాదయాత్రలు వంద ఎలుకలను తిన్న పిల్లి తీర్థయాత్రలు చేసినట్లుందని అంబెడ్కర్ ను అవమానించి ప్రజాస్వామ్యన్ని కాలరాసిన కాంగ్రెస్ పార్టీ చేసిన దేశద్రోహపు చర్యలను ప్రజలకు తెలియజేస్తామని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మద్రిపెల్లి సత్యమ్ అసెంబ్లీ మాజీ కన్వీనర్ కస్తూరి సత్యంలు పేర్కొన్నారు. గొల్లపెల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులు లేని కాశ్మీర్ ను తయారు చేసిందని ఈశాన్య భారతదేశంలో ఎనిమిది రాష్ట్రాల్లో హిందువులను మైనార్టీలుగా చేసి నిత్యం ఆశాంతికి దారి తీసిందన్నారు.370 ఆర్టికల్, 35(%ూ%) లాంటి అంశాలను రాజ్యాంగంలో పొందుపరిచలేదని అంబెడ్కర్ గారిని కేంద్ర మంత్రివర్గం నుండి తొలగించి 1962లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అంబెడ్కర్ పై నెహ్రూ ఇంట్లో పనిమనిషిని పోటీకి దింపి దుష్ప్రచారం చేసి ఓడించిన కాంగ్రెస్ పార్టీకి జై భీమ్ అని ఉచ్చరించే నైతిక హక్కు లేదన్నారు.అంబెడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అత్యధిక సార్లు సవరించి 1975లో ఎమర్జెన్సీ విధించి సెక్యులర్ అనే పదాన్ని చేర్చి అంబెడ్కర్ ను అవమానించిన కాంగ్రెస్ పార్టీ బీజేపీని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఇందిరాగాంధీ హయాంలో పట్టుబడిన తొంబైమూడు వేల మంది పాక్ సైనికులను వదిలిపెట్టి జయించబడిన పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను పాకిస్తాన్ కు బహుమతిగా ఇచ్చిందని 90వేల చ.కి.మీ. భూభాగంతో పాటు కైలాస మానస సరోవరంను చైనాకు అప్పగించిందని ఇవన్నీ మరచిపోయి పార్లమెంట్ సాక్షిగా రాహుల్ గాంధీ బిజెపి హయాంలో అరవైనాలుగు వేల చ.కి.మీ. చైనా ఆక్రమించిందని దుష్ప్రచారం చేసి దేశం పరువుతీస్తున్నాడని అన్నారు.జమ్మూ కాశ్మీర్ లో రోహింగ్యాలకు పునరావాసం కల్పించి బంగ్లాదేశ్ ముస్లింలను దేశంలోకి చొప్పించి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందని అన్నారు. %చీ=జ% ని వ్యతిరేకించి రాత్రి రెండు గంటలకు సుప్రీంకోర్టు తలుపులు తెరిపించి శిక్ష పడిన దేశద్రోహులను రక్షించే ప్రయత్నం చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. 2700 వందల మంది సిక్కులను ఊచకొత కోసి వందేమాతర గీతాన్ని జాతీయ గీతంగా ఆలపించకుండ చేసి 26/11 దాడుల వెనుక హిందువుల హస్తం ఉందని చెప్పిన పార్టీ కాంగ్రెస్ అని 1966లో గోరక్షక ఉద్యమకారలైన సాధుసంతువులపై తుపాకీ గుళ్ల వర్షం కురిపించి వందలాది మంది పొట్టన పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి జైబాపు అనే హక్కు లేదన్నారు. హజ్ యాత్రకు సబ్సిడీ ఇచ్చి అమర్ నాథ్ యాత్రకు పన్ను వేసింది కాంగ్రెస్ పార్టీ అని గుజరాత్ లో సర్దార్ పటేల్ సోమనాథ్ మందిరాన్ని నిర్మించుకున్నాడని విరోధించి ప్రారంభోత్సవానికి వెళ్లకుండ అప్పటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ ను విరోధించిందని ఇంతటి నీచమైన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీని విమర్శించడం మానుకొని కాంగ్రెస్ చేసిన తప్పులకు దేశప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీకి అంబెడ్కర్ పట్ల గౌరవం ఉంటే 1993 లో భారతరత్న ప్రకటించి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బీజేపీకి అంబెడ్కర్ పట్ల రాజ్యాంగం పట్ల గౌరవం ఉంది కాబట్టే పార్లమెంట్ సెంట్రల్ హాల్లో అంబెడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించి భారతరత్న ప్రధానం చేసి రాజ్యాంగ విలువలకు లోబడి నరేంద్ర మోడీ పరిపాలన కొనసాగిస్తూ ప్రజల మన్ననలు పొంది మూడవసారి అధికారంలోకి వచ్చిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తెరగాలి అన్నారు.ఈసమావేశంలో బిజెపి మండల అధ్యక్షులు కట్ట మహేష్ మండల బిజెపి నాయకులు అనుమాండ్ల రాఘవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బోయపోతు రాజు,లక్కాకుల వెంకటేష్, చెవులమద్ది రాజు తదితరులు పాల్గొన్నారు.